ధారావాహిక

భాగం -6



# చైతన్య స్రవంతి



డా. జి.భవానీ కృష్ణమూర్తి

"మీరిరువురు వస్తే మాకు సంతోషం. అది మాకు ఆశీర్వాదంగా భావిస్తాం.ఆ పై మీ ఇష్టం "అంది, జానకమ్మ.

"మూడు తరాలుగా మా ఇంటి పురోహితులు మీరు.. నాకు తెలుసు అమ్మగారు ఈ గడపదాటి ఎక్కడికి వెళ్లి ఉండరని. మీరు మాయింట తినరని కూడా తెలుసు. మీకు అన్ని ఏర్పాటు చేస్తాము. చీకటితోనే కారులో వచ్చేస్తే, పుష్కర ఘాట్ లో.... పవిత్రగోదావరిలో స్నానం, అనుష్ఠానం పూర్తి చేసుకుని, మాయింట కార్యక్రమం జరిపించి,పాలు పళ్ళో, ఫలహారమో స్వీకరించాక మళ్ళీ, రాత్రికి మిమ్మల్ని ఇక్కడ దిగబెట్టే ఏర్పాటు చేస్తాము."లేచి నిలబడి చేతులు జోడించి చెప్పాడు రాఘవరావు.

"ఆలోచించి కబురు చేస్తాను. మీ పేరు,ఫోన్ నంబర్ ఈ పుస్తకంలో రాయండి "అని, ఫోన్ నంబర్స్ ఉన్న డైరీ ఇచ్చారు.


డైరీ మధ్యలో ఉన్న పెన్ను తీసుకుని తన పేరు, సెల్ నంబర్ రాశాడు రాఘవరావు.ఆయన నంబర్ అడిగి తన సెల్ లో సేవ్ చేసుకున్నాడు,

***

"అక్కా... ఒక్క నిముషం..."కాసేపాగి, అక్కా!ఎలా ఉన్నావ్? అన్నయ్య కాల్ చేసి చెప్పాడు... రాజమండ్రిలోనే ఉన్నావట కదా. బాబు పుట్టబోతున్నాడట... చాలా సంతోషం..." గొంతు గాద్గదికమైంది.

"నేను బాగున్నాను. నీ పెళ్ళి అయినట్టే నాకు తెలియలేదు."

"ఏం పెళ్ళో? చదువయ్యాక అక్కడ స్కూల్ లో టీచర్ గా చేరాను. పెళ్లయ్యాక ఇక్కడ కూడా ఉద్యోగం చెయ్యమన్నారు. స్కూల్ లో టీచర్ గా జాయిన్ అయ్యాను. ఆయనకి నేను సంపాదించే డబ్బు కావాలి. నేను బయట ఎవరితోనైనా నవ్వుతూ మాట్లాడితే చచ్చేంత అనుమానం..




బాగా తాగుతాడు.తాగి ఇష్టం వచ్చినట్లు వాగుతాడు. అదేంటి అంటే ఇష్టం వచ్చినట్లు కొట్టడం., నాన్నగారికి చెప్తే కొన్నాళ్ళు ఓపిక పట్టు

అంటారు. నువ్వు కులాంతరం చేసుకున్నావని రెండు, మూడు సంబంధాలు తప్పిపోయాయి. మన శారదత్తయ్య చనిపోయాక మావయ్య మళ్ళీ పెళ్ళి చేసుకున్నారుగా. ఆవిడ చెల్లెలి కొడుకు. పెళ్ళికి ముందు ఎంతనక్కవినయాలు ప్రదర్శించారని? 'అన్నయ్య గారూ!పెళ్ళిళ్లు స్వర్గంలో నిర్ణయింపబడతాయంటారు. బుజ్జికి అలా కులం తక్కువవాడితో రాసిపెట్టి ఉందేమో.. దానికి మీరేం చేస్తారు? మీ చిన్నమ్మాయిని కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాం" అంటూ సన్నాయి నొక్కులు నొక్కింది. అదంతా నటన అని, తన తాగుబోతు కొడుక్కి తెలిసిన వాళ్లెవరు పిల్లనివ్వడం లేదని, నన్నేదో ఉద్ధరిస్తున్నట్లు నాటకాలాడారు" ఏకబిగిని చెప్పేసింది,సుశీల.



"ఐ యామ్ సారీ చిన్నీ... మరీ అంత దుర్మార్గం ఏమిటే?"

"నువ్వు అన్య కులస్థురాలివని, నువ్వు అప్పుడైనా కనిపించినా మాట్లాడవద్దని ఆంక్ష విధించారు. అందుకే పక్కకొచ్చి మాట్లాడుతున్నా... ఆ... మా అత్తగారు... ఎవరితో మాట్లాడుతున్నానో గమనించడానికి వస్తోంది. ఫోన్ పెట్టేస్తున్నా" అంటుండగానే డిస్కనెక్ట్ అయింది.

సెల్ పక్కన పెట్టి చెంపల మీదుగా జారుతున్న కన్నీటిని తుడుచుకుంటున్న స్రవంతిని చూసి, "ఏమైందమ్మాయ్?" అడిగాడు రాఘవరావు.

జరిగిన విషయం చెప్పింది.

"ఏమైనా తొందరపాటు నిర్ణయం తీసుకుంటుందేమో? ఇప్పటి పిల్లలకి ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ.

ఏ అవసరం వచ్చినా మనం అండగా ఉంటామని చెప్పు. మా అబ్బాయి నంబరు, నీ సెల్ నంబరు మారు పేర్లతో సెల్ లో సేవ్ చేసుకోమని, ఏ అవసరం వచ్చినా వెంటనే మెసేజ్ పెట్టమని ధైర్యంచెప్పు" అన్నాడు.

"అలాగే మావయ్యా" కృతజ్ఞతా పూర్వకంగా చూసి, వెంటనే మెసేజ్ లు పెట్టి "మా నంబర్స్ మారు పేర్లతో సేవ్ చేసుకుని, ఈ మెసేజ్ లు అన్నీ డిలీట్ చేసేయ్ చిన్నీ. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా మీ బావకి అయినా,నాకయినా మెసేజ్ పెట్టు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకు.నీకు మేమున్నాము" అని ధైర్యం చెప్పింది.

"అలాగే అక్కా, థాంక్స్" సమాధానం వచ్చాక స్థిమితపడింది స్రవంతి.

చైతన్య ఇంటికి వచ్చాక ఆ విషయం చెప్పింది.

"మంచి పని చేశావ్... అతని వివరాలు కనుక్కో. నాతో చదువుకున్న వాళ్ళు ఒకరిద్దరు వైజాగ్ లో ఉన్నారు. వాళ్లకి చెప్తే... వాళ్ళు చూసుకుంటారు."

"తొందరపడకూడదు కన్నా , అతగాడు అసలే అనుమానం మనిషి అంటున్నారు".అంది జానకమ్మ.

"నిజమే "అనుకున్నారందరు.

***

రాఘవరావు కారుని సరాసరి పుష్కరఘాట్ దగ్గర ఆపించాడు.పురుషోత్తమశాస్త్రి, సావిత్రమ్మ, వారితో పాటు వచ్చిన శిష్యుడు గోపాలం,గోదావరిలో దిగి స్నానాలు చేసి, బట్టలు మార్చుకున్నారు. శాస్త్రిగారు, గోపాలం సంధ్యావందనాది అనుష్టానాలు అక్కడే పూర్తి చేసుకున్నాక, ఇంటికి తీసికెళ్లాడు. వారు లోపలికి రాగానే జానకమ్మని, చైతన్యని పరిచయం చేశాడు. చైతన్య ఇద్దరికీ పాదాభివందనం చేశాడు.

"దీర్ఘయుష్మాన్ భవ. సర్వదా దిగ్విజయమస్తు" ఆశీర్వదించారు.

"నువ్వు కడుతున్న షాపింగ్ మాల్ ని గురువుగారికి చూపించు కన్నా, వాస్తు దోషాలు ఏవైనా ఉంటే చెప్తారు. ఈలోగా ఇక్కడ గోపాలంగారు పూజకి ఏర్పాట్లు సిద్ధం చేస్తారు" అన్నాడు రాఘవరావు.

సరేనంటూ బ్యాక్ డోర్ తెరిచి పట్టుకుని శాస్త్రిగారు కూర్చున్నాక,తనే డ్రైవ్ చేస్తూ సైట్ కి తీసికెళ్లాడు. శాస్త్రిగారు అంతా తిరిగి చూసి, చిన్న చిన్న మార్పులు చెప్పి, "ప్లాన్ అద్భుతంగా ఉంది బాబూ. గోడలు కాస్త కొత్తగా తేడాగా అనిపిస్తున్నాయి, ఇదేదో కొత్త మోడల్ గా ఉన్నట్లుంది"అన్నారు.

కాస్త దూరంగా నిలబడి ఉన్న ఒకతనికి రమ్మని సైగ చేసి "ఇతను నామిత్రుడు ఖలీల్. ప్లాస్టిక్ వ్యర్థములను కరిగించి కాస్త మందపాటి పలకలు తయారుచేశాడు. అవి ప్లాస్టిక్ అయినా మామూలు వేడికి ఎండకి, వర్షానికి పాడవవు. పిల్లలు పెన్సిల్ పెన్నులతో గీతలు గీసినా తుడిచేస్తే పోతాయి. లప్పం పెయింటింగ్ కంటే చవకగాను,అందంగాను ఉంటాయి. ఆర్డర్ ఇస్తే మనకి కావలసిన సైజ్, డిజైన్ లో చేసి ఇస్తారు. ప్రయోగాత్మకంగా మొదటి అంతస్తుకి పెట్టడానికి ఈ భవనయజమానులు ఆర్డర్ ఇచ్చారు.. కొన్నాళ్లయ్యాక అది మార్చాలనుకుంటే మరొకటి తెప్పించి పెట్టుకోవచ్చు. ఇటీవల ప్లాస్టిక్ వాడకం ఎక్కువ అయి, వ్యర్థాలు నదులని, పరిసరాలని,వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని, కొన్నాళ్ళుగా పరిశోధన చేసి ఈ పలకలు తయారీ కనిపెట్టారు . ఇది షాపింగ్ మాల్ కనుక జనం వచ్చి పోతుంటారుకదా. చూసి నచ్చితే ఆర్డర్స్ వస్తాయని ఆశ."

"సరుకు నాణ్యమైనది అయితే జనం ఇష్టపడతారు. మొదట్లో ధరలు అందుబాటులో ఉంచాలి. ఆరంభంలోనే లాభాల గురించి ఆశ పడకుండా సామాన్యులకి ధరలు అందుబాటులో ఉంటే మార్కెట్ లో నిలబడగలుగుతారు" అన్నారు శాస్త్రిగారు.



ఖలీల్ కాస్త ముందుకి వచ్చి దూరం నుంచే వంగి నమస్కరించి "అంతా మీ ఆశీర్వాదం గురువుగారు" అన్నాడు.

"విజయోస్తు.. సమస్త సన్మంగళాని భవంతు" ఆశీర్వదించారు.

తిరిగి వస్తూ "ఎక్కడ చదివావు?" అంటూ చైతన్య వివరాలు అడిగి, "నీ జాతకం చూశాను. నాలుగయిదేళ్లు కాస్త ఒడిదుడుకులు వస్తాయి గానీ, ఆ తరువాత బాగుంటుంది.ఈ నాలుగయిదేళ్లు కాస్త జాగ్రత్త గా ఉంటే సరిపోతుంది.. మీ నాన్న గారు మీది ప్రేమ పెళ్ళి అని చెప్పారు.మీ భార్య భర్తలు గొడవలు పడకుండా సంయమనంతో ఉండాలి.

పరస్పర అవగాహన ముఖ్యం. నేనో మంత్రం చెప్తాను నిత్యం చదువుకుంటూ ఉండు.అంతా మంచి జరుగుతుంది"అన్నారు.

"అలాగేనండి."అన్నాడు వినయంగా.

అంతకు ముందు అతనికి పెద్దగా నమ్మకం లేకపోయినా, వ్యాపారంలో, తన జీవితంలో

వచ్చిన ఒడిదుడుకుల వల్ల నమ్మకం, భక్తి ఏర్పడినాయి.

***

జానకమ్మ సావిత్రమ్మని "రండమ్మా" అంటూ లోపలికి తీసికెళ్ళింది. డ్రైవర్ బ్యాగ్ తెచ్చి లోపల పెట్టాడు.గోపాలం అతన్ని అనుసరించాడు.

జానకమ్మ తిన్నగా స్రవంతి ఉన్న గదిలోకి తీసికెళ్ళింది.

తల్లినిచూసి గబాగబా దగ్గరకొచ్చి వాటేసుకోబోయి బ్రేక్ పడినట్లు ఆగిపోయి "నిన్ను... నిన్ను ముట్టుకోచ్చామ్మా" అడిగింది, గద్గదస్వరంతో.

తనే రెండడుగులు ముందుకేసి కూతుర్ని కౌగలించుకుంది సావిత్రమ్మ.

"మాకుముందుగా ఒక మాట చెప్పి ఉంటే...."

తల్లి మాట పూర్తి కాక ముందే "నాన్నగారు నన్ను బయటికి రాకుండా గదిలోపెట్టి తాళం వేసేవారు" అంది స్రవంతి.

"మీకు దూరం అయ్యాననే బాధ తప్ప నాకే సమస్య లేదు అత్తయ్య మావయ్య నన్ను కన్నబిడ్డలా చూస్తున్నారు. మీ అల్లుడు... సారీ మీరు అతన్ని అల్లుడు అనుకోవడం లేదు కదా, మా ఆయన నన్ను అపురూపంగా, మహారాణిలా చూస్తున్నారు. అమ్మా,.. అసలు...."

"అమ్మాయ్!!అమ్మగారితో కాస్త ప్రశాంతంగా మాట్లాడమ్మా. నాన్న గారు వచ్చేస్తే కుదరక పోవచ్చు. చైతూతో సైట్ దగ్గరికి వెళ్లారు."స్రవంతితో చెప్పి,"అమ్మా!మావాడు మీ అమ్మాయి కోసం తన అలవాట్లు కూడా మార్చుకున్నాడు. అమ్మాయిని ప్రాణప్రదంగా చూసుకుంటున్నాడు. మీరు నిశ్చింతగా ఉండండి. గురువుగారి ముందుకి అమ్మాయిని పూజకి ముందు తీసుకురావడమా, చివరగా తీసుకురావడమా అనేది తోచడం లేదు "అంది జానకమ్మ.

"చివరగానే తీసుకురండి. ముందు అయితే ఆయన పూజ జరిపించకుండానే వెడదాం పదమంటారు" చెప్పింది సావిత్రమ్మ.

"తరువాత అయినా కోపం తెచ్చుకుంటారు"దీర్ఘంగా నిట్టూర్చింది సావిత్రమ్మ.

"సరే ఏదైనా కానివ్వండి. మీరిద్దరూ కాసేపు ప్రశాంతంగా మాట్లాడుకోండి. బిడ్డను కనబోతున్న మా కోడలు కోసం ఆయన ఏమన్నా భరిస్తాము."అన్నాడు రాఘవరావు, జానకమ్మకు వారిని ఒంటరిగా వదిలి పెట్టి బయటికి రమ్మని సైగ చేస్తూ.

తల్లి పక్కనున్న కుర్చీలో కూర్చుని ఆమె భుజం మీద తల వాల్చి మెడ చుట్టూ చేతులు వేసి,"అమ్మా!చిన్నీ కి అతనెలాంటివాడో వాకబు చేయకుండా ఎందుకమ్మా వాడికిచ్చి చేశారు. 'చావాలని ఉందక్కా' అని ఒకటే ఏడుపు".

"మీ మావయ్య తన మరదల్ని తీసుకొచ్చి చాలా మంచివాడు అని చెప్పారు. మీ నాన్న నమ్మారు. మన వాళ్లలో ఎవరూ అలా లేరేమో మీ నాన్నకి, వాళ్ళ గురించి వాకబు చెయ్యాలని తోచలేదు. ఒకళ్లిద్దరూ పిల్లలు పుడితే అతనే మారతాడు అంటున్నారు మీ నాన్న".

"ఏమో ఏమ్మారతాడో? ఈ లోపల దానికి ఓర్పు నశిస్తే ఏం తొందర పాటు పని చేస్తుందోనని భయంగా ఉంది. ఏ అవసరం వచ్చినా ఫోన్ చెయ్యి అని ధైర్యం చెప్పాననుకో"

"ఏమో తల్లీ మీ ఇద్దరి బ్రతుకులు చెరో విధంగా అయ్యాయి. అన్నయ్యేమో..."

"అన్నట్లు అమెరికాలో అన్నయ్య,మా ఆడపడుచు భర్త ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారుట.

అత్తయ్య, మావయ్య అమెరికా వెళ్ళినప్పుడు అన్నయ్య,వదిన కలిశారట. చాలా మంచి కుటుంబంలో కోడలివయ్యావు. ఆంటీ అంకుల్, కార్తీక చాలామంచివాళ్ళు అన్నాడు అన్నయ్య.

“కార్తీక మా ఆడపడుచు. ఆయనకి అక్క"

"పోనీ లేమ్మా, మీరంతా సుఖంగా ఉంటే అంతే చాలు మాజీవితాలు ఎలాగో వెళ్ళిపోతాయి" భర్తకి తెలియకుండా కొంగున కట్టి తెచ్చిన బంగారపు గొలుసు తీసి కూతురు మెడలో వేసింది.

"వద్దమ్మా నాన్న గారికి తెలిస్తే నిన్ను..'

"ఇది మీ నాన్నచేయించింది కాదులే, మా పుట్టింటి వాళ్లు యిచ్చింది. ఉండనీ తల్లీ. ఈ అమ్మ ఇంత కంటే ఏమి ఇవ్వలేదు" అంది, కళ్లు తుడుచుకుంటూ.

"నీ దీవెన చాలమ్మా. నీ ప్రేమ కంటే నాకు ఏ కానుకలు అక్కర లేదు. ఎప్పుడు ఏ పూజలకి మన గడప దాటి ఎవరింటికి వెళ్ళని నువ్వు, నా కోసం వచ్చావు. ఏ అత్తమామలూ కోడలి కోరిక తీర్చడానికి ఇంత సాహసం చెయ్యరు. దాన్ని బట్టి అర్థం చేసుకో వారికి నేనంటే ఎంత అభిమానమో ".

"అవునుతల్లి. మీ అత్తగారు వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చి చెప్పి బ్రతిమాలారు. ఆవిడ పెద్ద మనసుకి చేతులెత్తి దణ్ణం పెట్టాలి" అంది సావిత్రమ్మ.

"సరి సరి.. మీరిద్దరూ కాసేపు మాట్లాడుకోండి అంటే ఇదా... పెద్దలు మీరలా అనకూడదు ఆశీర్వదించాల్సిన చేతులు మీవి. గురువుగారెంతటి వాక్ శుద్ధి కలవారో నాకు తెలుసు. హాల్లోకి పదండి,గురువుగారు సైట్ దగ్గర నించి బయలు దేరారట. దగ్గరే. కాసేపట్లో వచ్చేస్తారు "అన్నాడు రాఘవరావు.

సావిత్రమ్మ కూతుర్ని దగ్గరకు హత్తుకుని నుదుటి మీద ముద్దు పెట్టి, "పండంటి బిడ్డను కని సుఖంగా ఉండు తల్లీ" అని బయటికి వచ్చి హాల్లో సోఫాలో కూర్చుంది.

మరో రెండు నిముషాల్లో కారు గుమ్మం ముందు ఆగింది. చైతన్య దిగి, వెనక డోర్ తెరిచి పట్టుకున్నాడు.

శాస్త్రిగారు దిగి, గుమ్మం పక్కన పెట్టి ఉన్న బకెట్ లో నీళ్లు తీసుకుని కాళ్ళు కడుక్కుని లోపలికి వచ్చారు.

గోపాలం అప్పటికి పూజకి, హోమానికి చుట్టూ ఇటుకలు పేర్చి మధ్యలో ఇసుక పోసి, చుట్టూ ముగ్గులు పెట్టి, హోమగుండం,కావలసిన సరంజామా అంతా సిద్ధం చేశాడు.

"రాఘవరావ్!అబ్బాయిని బట్టలు మార్చుకుని వచ్చి కూర్చోమనండి. అమ్మాయి గర్భవతి, ఆరోగ్యం బాగులేదంటున్నారుగా,

చివరిలో ఆశీర్వాచనానికి వస్తే సరిపోతుంది "అన్నారు శాస్త్రి గారు, జానకమ్మ తెచ్చి,బల్ల మీద పెట్టిన పాల గ్లాస్ అందుకుంటూ.

చైతన్య సతీసమేతంగా పీటల మీద కూర్చోవాలంటే ఎలాగా అని మధనపడుతున్న రాఘవరావు దంపతులు ఊపిరి పీల్చుకున్నారు..

చైతన్య పూజ,హోమం భక్తి శ్రద్ధలతో శాస్త్రిగారు చెప్పిన విధంగా చేశాడు.ఆయన చెప్పిన మంత్రాన్ని పేపర్ మీద రాసుకుని, సెల్ లో రికార్డ్ కూడా చేసుకున్నాడు. రోజు వీలైనన్ని ఎక్కువసార్లు మననం చేసుకో. కనీసం పదకొండు సార్లు అయినా చదువుకో."చెప్పారు.

"సరే గురువుగారు "వంగి ఆయనకి పాదాభివందనం చేశాడు.

చివరలో ఆశీర్వచనానికి కోడల్ని తీసుకురమ్మన్నప్పుడు జానకమ్మ స్రవంతిని తీసుకొచ్చింది. ఆశీర్వచనమంత్రాలు చదువుతూ గమనించలేదు గానీ అక్షింతలు వేస్తూ "దీర్ఘాయుష్మాన్ భవ! సర్వదా దిగ్విజయమస్తు!", అని చైతన్యని దీవించి, "దీర్ఘ సుమంగళీభవ, సత్ సంతానప్రాప్తి రస్తు, పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు" ఆశీర్వదిస్తూ కూతుర్ని చూసి ఒక్కక్షణం ఆగిపోయి, అక్షింతలు వేసేశారు.

"నాన్నగారూ!... "స్రవంతి ఏదో అనబోతుంటే.. శాస్త్రిగారు చెయ్యి అడ్డుపెట్టి "గోపాలం!బయలుదేరు, మీ అమ్మమ్మగారిని రమ్మను" అంటూ ఉత్తరీయంతీసి, చొక్కా వేసుకుని బయటికి నడిచారు.

ఇద్దరికీ పట్టుబట్టలు, దక్షిణ తాంబులాలు తీసుకు వస్తున్న జానకమ్మ,"గురువుగారిని పిలవండి "రాఘవరావుతో అంది గానీ ఆవిడ మాటలు గాల్లో కలిసి పోయాయి.

(సశేషం )

# జీవితంలో హాస్యం

## తలుపుల సంగీతం

కార్పెంటర్ తో....

'చారి గారూ...తలుపులు వేస్తూ ఉంటే సన్నగా శబ్దం వస్తోంది...చూస్తావా?' అడిగేను.

'వచ్చి వింటాను లెండి..సారీ చూస్తాను లెండి..' అన్నాడు.

అన్నాడే గానీ నాలుగు రోజులు అయినా చారి పత్తా లేదు.

మళ్ళీ ఒక రోజున బజార్లో కనిపించాడు.

'చారి గారూ...నా తలుపుల సంగతి ఏం చేశారు ? ' అన్నాను.

'ఈ రోజు వస్తా సార్..' (అటో ఇటో తేల్చేస్తా అన్నట్టు..) ఇంకా సౌండ్ వస్తోందా సార్..? ఆరా తీశాడు.

నువ్వు ఇంకా సౌండ్ దగ్గరే ఉన్నావ్..సుబ్బ రంగా పాటలు కూడా పాడుతూ ఉన్నాయి..త్వరగా రా...' చెప్పాను...

సైకిల్ కి సామాన్ల సంచీ తగిలించుకుని నన్ను ఫాలో అయ్యాడు మిస్టర్ చారి.

భమిడిపాటి వెంకటేశ్వర రావు